# శృంగభంగము

తాంబూలం వేసుకోడానికి కూచ్చునేదాకా నాకు బోధపళ్ళేదు, అన్నపూర్ణ ఆనందాన్ని ప్రేమించిందని. పొద్దున కాఫీతాగేవేళ, ఇందాక భోజనాల దగ్గరా అనుమానపడటానికి వీలుందిగాని, ఈ హైక్లాసు సొసైటీలో ప్రతిదీ చెట్టు చిటారు కొమ్మన ఉంటుంది గనుక నేనేమీ అనుకోలేదు. పైగా వొచ్చిన ఊహను బలవంతాన గెంటేశానుకూడా.

"పాపం. ఎంత దయతో తిరుగుతోందో చూశారా, ఫాన్!" అన్నాడు ఆనందం.

"దయతో తిరగటమేమిటీ. మనం స్విచాన్ చేస్తే...."అన్నాను. ఆ ఫాను, మనది. మనకై దయతో, జాలిగా, పాపం అని తిరుగుతోందా? హుఁ! ఈ కాలం కుర్రాళ్ళు అంతా యింతే—

అన్నపూర్ణ తమలపాకులపళ్ళెం తెచ్చి ముందు పెట్టి తానూ కూచ్చుంది. ఆనందం కళ్ళతో ఆమెను తాగేట్టు చూస్తున్నాడు. కాలిదగ్గర జరీఅంచు కుచ్చెళ్ళ దగ్గర్నుంచీ తల్లోని ఈవినింగ్‌–ఇన్‌–పారిస్ సువాసనదాకా.

"ఫాన్ జాలిగా తిరుగుతోందంటే. సదాశివన్ ఒప్పుకోలేదు" అన్నాడు ఆనందం.

"మీరు చెప్పండి. మనం స్విచాన్ చేశాం; ఇంక దానికి జాలేమిటీ" అన్నాను.

"మనం ఉక్కవల్ల పడే యిబ్బంది అది గమనించకపోతే, గమనించినా సింపతీ కలక్కపోతే, అది కిక్కురుమనకుండా ఊపకుంటే. మనం ఏం చెయ్యగలం. చెడిపోయిందని దణ్ణం పెట్టడం తప్ప?" అన్నాడు ఆనందం లీలగా, ఖేలగా.

వీడికేమన్నా పిచ్చా. లేక అన్నపూర్ణదగ్గిర కోస్తున్నాడా?

అన్నపూర్ణ నవ్వింది. నుదురు ఢళథళమంది.

తమలపాకులు వేసుకోటం ప్రారంభించామేగాని నేను ఆలోచిస్తూనే ఉన్నాను. నెమరుకొస్తోంది. మొదట్లో అన్నపూర్ణదగ్గర వీడి పరిచయం, ఇతను తనురాసిన పద్యాలను పాడటం. అన్నపూర్ణలో కించిత్తు కదలికా, అన్నపూర్ణ టీకి పిలవడం అన్నీ. మర్నాడు పొద్దున కాఫీతాగేప్పుడు టేబుల్‌దగ్గర—ఆనందం వీలైనంతవరకూ రసాన్ని ప్రజలకు అందివ్వాలనడం, నేను అడ్డుకోడం, వాడు అదేపట్టుకూర్చోడం అన్నీ.

"చూడండి, మీకేగనుక ఈ ప్రజలమీద దాక్షిణ్యంవుంటే మీ సంగీతాన్ని వీలైనంత వరకూ వాళ్ళకు అందిస్తారు!"

"అసాధ్యం!"

"ఏం, గుళ్ళల్లో, పబ్లిక్ కచేరీల్లో మీరుచేస్తే జనానికి వీలుబాటు కాదూ?"

"మీ కవిత్వం ఏం దగ్గిరికి తెచ్చారు?"

"తేకేం? మా పద్యాలు—Beg your pardon, నా పద్యాలు—అణాపెడితే లభ్యమయ్యే పత్రికల్లో అచ్చేయిస్తాను. నా కవిత్వం చదివే వాళ్ళందరూ, లేదా కవిత్వంమీద రుచిగలవాళ్ళందరూ, పోనీ కవిత్వం చేసే, ఆపరేషన్ చేయించుకోవలసిన వాళ్ళందరూ బీదవాళ్ళనీ, డబ్బున్న వాళ్ళు కారనీ నాకు తెలుసు, అంచేత వేరే పుస్తకంగా వెయ్యను."

నాకు నవ్వొచ్చింది. కళలను ప్రజలకు ఊరికే యిమ్మనీ, వీలైనంత చౌకగా యిమ్మనీ అనేవాళ్లు ఉత్తదొంగలు. గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్లు కాలుస్తూ, సోషలిజం అని అరిచే కుర్రాళ్లు వీళ్ళంతా.

ఆనందం మళ్ళీ అందుకుని, "మీరు పెద్ద కచేరీలు తప్ప యింకోటి చెయ్యనంటే మీ సభలకు ఎంతమంది రాగల్రు? పోనీండి, రేడియోలో పాడరాదూ, నలుగురికీ తెలుస్తుంది?"

రేడియోలో పాట్టమా? అంత అదృష్టమే? వీడికి రేడియోలో పాట్టానికి ఎంత ఆశ్రయించాలో తెలుసా?

నాటకం, టిక్కెట్లతో, యిప్పటివలె ఉండగూడదనీ, వీధి నాటకాలు బెస్టు అనీ, యిప్పుడు గూడా వీధినాటకాలవలె ప్రతికళా తయారు కావాలనీ ఆరోజున వీడు అన్నాడు. అప్పుడే అనుమానం వేసింది—వీడికేమన్నా రష్యాజబ్బుందా అని యిప్పుడు తేలింది. ఆహా! వీడు సోషలిస్టే!

అన్నపూర్ణ తాంబూలం అని గుర్తుకు తెచ్చింది. ఉలిక్కిపడటాన్ని అణుచుకుని "ఆనందంగారు వేసుకోరేం?" అన్నాను. ఆనందం వొక్క ఆకు అన్నా చీల్చలేదు, సున్నమూ రాయలేదు.

"వేసుకుంటాను లెండి, కానివ్వండి!"

"ఏమోయ్! వేసుకోవేం?" అన్నపూర్ణ.

"మీరు కానీండి!" అన్నాడు లోగొంతుకతో. అన్నపూర్ణ పల్చని పెదిమలు ఎఱ్ఱగా ఉన్నై. ఆనందం సిగరెట్టు అంటించాడు.

"అబ్బ! ఈ పాడు సిగరెట్లు మానవోయ్!" అంది అన్నపూర్ణ.

నవ్వాడు ఆనందం. ఇదే వీలని నేను గబగబా తమలపాకుల్ని నమల్తున్నాను. చెమట ఆరుతూన్న ముఖం, గాలికి ఊగే క్రాపు, ఆ నుదురు, మెచ్చుకోవాలి తప్ప, నాకేం బాగుల్లేదు.

"తాంబూలం వెయ్యనా?"

ఊరుకున్నాడు.

"ఇష్టంలేదా?"

"లేకేం—" పెద్దగా ఊపిరితీసి, "మీరు తాంబూలం వేస్తుంటే- మిమ్మల్ని చూడకుండా ఆకుల్ని మేకలాగా నమలలేను. కొంతమంది డ్రెస్ చేసుకున్నాక, కొంతమంది నడుస్తుంటే, కొంతమంది మాట్లాడుతుంటే కొంతమంది తాంబూలం వేస్తుంటే వాళ్ళను చూట్టంలో ఉన్న తృప్తి అప్పుడు యింకేం చేసినా రాదు" అన్నాడు. అన్నపూర్ణ ఏమీ మాట్లాడలేదు. కవిగాళ్ళు ఈ రకం పిచ్చాళ్ళేనని నే ననుకున్నాను. ఫాన్ స్విచాఫ్‌చేసి, కొంచెం కునకడానికని లేచాం. ఎంత వట్టివేళ్ళ తడికలైనా మద్రాసు కూడా బెజవాడలాగా పేలుస్తోంది. రాజగోపాలాచారి ఎసెంబ్లీలో రూపాయల్ని మద్రాసులోని నీళ్ళలాగా వాడాలి అని అన్నాట్ట. ఈ ఎగ్మూరులోనే యిట్లా వుంది. టౌన్‌లో వాళ్ళు ఎలా ఉంటారో....

ఆనందం పత్రికల్ని తిరగేస్తున్నాడు. అన్నపూర్ణ సోమర్‌సెట్ మూఘం ఆల్ టుగెదర్ చదువుతోంది. ఎండ కాలుస్తోంది—దీపకరాగం వలె.

మైకం వొదిలేప్పటికి మెల్లిగా రేడియో పాడుతోంది "ఆడ బ్రతుకే మధురం!" అంటూ. కళ్ళు నులుముకుని, లేచి ఆవులించి వొళ్ళు విరుచుకుని చూశాను. కొబ్బరికాయ తురుమూ, మామిడిపళ్ళ ముక్కలూ అటు కేసి పోతున్నై. స్నానాల గదిలోకి వెళ్ళి, మొహం కడుక్కుని, స్పెక్స్ పెట్టుకుని నేనూ రేడియో దగ్గరకు వెళ్ళాను. ఆనందం లేడు. అన్నపూర్ణ వొక్కతే వుంది.

"రండి! కూర్చోండి!"—కూచ్చున్నాను.

"ఖులాసాగా నిద్రపట్టిందా?"

తల ఊపించాను.

అన్నపూర్ణ ఎక్కువ మాట్లాడదాయె. ఎప్పుడన్నా మాట్లాడినా మాటలను కాపీనంగా వాడుకుంటుందాయె. మొదట్లో మేం కలిసినప్పుడు కొంచెం మాట్లాడినా, తెచ్చి పెట్టుకున్నట్టున్నా బావుండేది. అదీ నాలుగు రోజులూ పక్కన కూచోటం, వొళ్ళు తగలటం జరిగితేనేం.... ఆ వొళ్ళు తగలటమైనా అపురూపం ఐతేనే. ఎప్పుడూ, మామూలుగా ఐతే ఏం హాయి? ఖర్మం— మాయిద్దరి మధ్యా అంతే. మరి ఈ ఆనందం —వీడూ అంతే అయివుంటాడు. అడిగితే డబ్బు ఇస్తుంది. నాలుగు సార్లు పుచ్చుకున్నాక మళ్ళీ అడగటానికి నా మొహం చెల్లదు. అయినా అడిగాను, యిచ్చింది. ఈ ఆనందం డబ్బు యిక్కడ యిస్తాడు తీసుకుంటాడు. వీడికి ఎలా వొస్తుందో. రేడియోలో ఏమన్నా పాడతాడు గావును. రేడియోను ఎంత చౌకగా మాట్లాడాడు? నాయర్ మంచినీళ్ళూ, ఇన్ని పూరీలూ, ఇంత బంగాళాదుంపకూరా తెచ్చి, అక్కడ పెట్టాడు.

కాఫీ చెయ్యడానికి కాబోలు లోపలకువెళ్ళాడు. అప్రస్తుతమైనా "ఆనందం గారేరీ!" అన్నాను.

"నిద్దరోతున్నాడు కావును"

చెప్పులు టకటకలాడినై . ఆనందం బజారునుంచి వొచ్చాడుకూలి వాడితో, తట్టతో. తట్టలో మామిడి పళ్ళు, రసాలు, సపోటాలు, మల్లె పూలు. సరాసరి ఆ బుట్ట లోపలికి తీసుకెళ్ళి అక్కడ పెట్టి వొచ్చాడు. రేడియో ఆపేసి కూచున్నాడు. గాలి వేస్తోంది, ఇంకొంచెం జోరుగా తలెత్తాను. ఫాన్ గిరాగిరా తిరుగుతోంది. గడియారం అయిదు గంటలు కొట్టింది,

"రాత్రి నెల్లూరు వెళ్ళాలి!"

అన్నపూర్ణ మొహం ఎత్తింది. ఆనందం జేబులో వెతికాడు. వైరు! అన్నపూర్ణ చదివింది. టిఫిన్ పుచ్చుకుంటున్నాం, మామూలు మాటలు, స్నేహసూచకాలు ఏవో మాట్లాడుతూ. ఈ కవిగాళ్లు పిచ్చిలో లేకపోతే బాగానే ఉంటారు.

"రేపు ఎక్స్‌ప్రెస్‌లో పోగూడదూ!"-అన్నపూర్ణ.

"ఈ ఎండల్లోనా? చచ్చామే."

"నాయర్ !"

"ఎందుకు, నాయర్‌తో చెప్పాను మెయిలు కెళ్తానని" అన్నాడు ఆనందం పూర్ణతో.

నాయర్ వొచ్చాడు.

"జలం కొండువా! "—పిల్చాంగదా అని పని చెప్పినట్టుంది. "నీళ్ళన్నాయిగా" అని అనబోయాను. నాలిక చివరిదాకా వొచ్చినా, ఎందుకో అనలేదు.

కాఫీతాగాక, ఆనందం సిగరెట్లు తీశాక వాళ్ళిద్దరూ గదికేసి వెళ్ళారు. జడవేసుకోటానికి విప్పుకున్న జుట్టును గుప్పిట్లో పట్టుకుని అన్నపూర్ణ వెళ్ళింది. ఆనందపు పొగలతో, నాలుగు నిమిషాలల్లో బయటికి వొచ్చారు. కాస్త టౌన్ కేసి వెళ్ళొస్తానని బయటకు వొచ్చాను. బయటికి వొచ్చాక అనిపించింది—అరె! బయలుదేరక పోతేనేం ....అని. వొస్తేనేంలే........

సాయిం్రతందాకా తిరిగాను. వెధవ బాధ మ్రదాసులో. పని లేకుండా బయటికి పోతే రూపాయికి పావుగంట విలువైనా ఉండదు. చిన్న జీతాలు తెస్తూ సంసారాలు ఈదేవాళ్ళు ఎలా ఉంటారో ఈ ఊళ్ళో! యింటిముఖం పట్టాను. ఎగ్మూర్ హైరోడ్ చివర బస్ దిగి, ముందుకు వంకర్లు తిరిగి, స్పర్‌టాంక్ కాలనీలోకి వొచ్చి వీళ్ళింటికి వొచ్చాను. నాయర్ వాకిట్లో కూర్చున్నాడు.

"ఉన్నారా?"

తల ఊపాడు. లోపలికి వెళ్ళి, కాళ్ళూ చేతులూ కడుక్కుని మేడమీదికి పోయాను. వొక్క మంచం మీద, ఎదురుబదురుగా అన్నపూర్ణ, ఆనందం పడుకుని ఉన్నారు మెల్లిగా మాట్లాడుకుంటూ. అన్నపూర్ణ తల్లో పూలు. ఆనందం లుంగీధారి. వాళ్లు నన్ను చూళ్ళేదు. యింకా మాట్లాడుతున్నారు. నెల్లూరు ప్రయాణమూకాదు, నీలాటిరేవు కబుర్లూకాదు. మధ్యమధ్య పిరాండెల్లో, బెర్‌ట్రాండ్ రసెల్, ఫ్రాయిడ్, హెరాల్డ్ జె. లాస్కీ అంటున్నాడు ఆనందం. అన్నపూర్ణ యిప్పుడే ఓడ దిగినట్లు డబ్లిన్ జీవితం అంటూ మాట్లాడుతోంది. "యూలిసిస్ కొనాలి!" అని ఆనందం. కాస్సేపు మాటల్లేవు.

"అచ్ఛా. నేను ఎల్లుండి వొస్తాను."

"డబ్బు చాలుతుందా?"

"చాలొచ్చు."

"పోనీ, యింకో పది తీసుకో" అంటూ అన్నపూర్ణ లేచింది.

వీడికి అడక్కుండానే యిస్తుందే. వీడేమన్నా అంటుకున్నాడా? నేను నెమ్మదిగా నడుస్తున్నట్టు నటించి లోపలికి పోయాను. ఇద్దరూ "హల్లో! "అన్నారు. కూచ్చున్నాను. ఆనందం పర్సు తీసి అందులో పదిరూపాయల కాగితం కుక్కింది ఆమె. ఆనందం పకుకునే సిగరెట్టు ఊదుతున్నాడు.

"నాయర్"

నాయర్ వొచ్చి కనపడి వంటింటో కెళ్ళాడు. ఆనందం లేచి భోజనానికెళ్ళాడు.యీ ఆనంద శని రెణ్ణాళ్ళు కనబడదనే హాయి అప్పుడే ఒళ్ళంతా పాకుతోంది. అన్నపూర్ణ బట్టలు మార్చుకుని, తల సర్దుకుని వొచ్చింది.

"ఏమండీ! ఏమన్నా కబుర్లు చెప్పరూ!"

చిరునవ్వు నవ్వాను. "ఏమున్నాయండీ!"

అన్నానే గాని, ఆమె కంఠం వొణుకే అనుమానిస్తున్నాను. అయి నవీ కానివీ తెగ వాగాలని వుంది. పోనీ, తాను తెగమాట్లాడకూడదా అనీ వుంది. కాని, మాట్లాడదు. ఇంకా నయం, కబుర్లు చెప్పండని అడిగింది. ఆమె జబ్బమీద టీకాలు తెచ్చిన అందం చూస్తున్నాను. ఆమె తెల్లనిచీర మల్లెపూవు వలె వుంది. ఛరాల్నా లోపలికి పోయి ఆనందం సిగరెట్లు తెచ్చి, తాను ముట్టించి, పొగతో వుక్కిరి బిక్కిరి ఐ పంతానికి తాగు తోంది. ఆనందం వొచ్చాడు. చిన్న నవ్వునవ్వి, సామాను సర్దుకోటా నికి వెళ్ళిపోయాడు.

మొగుడితో కాపరం చేసే నాటినుంచీ అన్నపూర్ణను ఎరుగు న్నాను. తన ఇష్ట ప్రకారమే నడిచేది. కాని, వోవిధమైన చొరవా,

అణుకువాకూడా వుండేది. అతను పోవడం, ఆస్తి అంతా ఈమెది కావటం, చదువుతూన్న ఇంటరు మానేసినా మద్రాసు వొదలక ఇక్కడే వుండటమూ గుర్తుకు వొచ్చె. అప్పుడు అతణ్ణి సిగరెట్లు తాగవొద్దని నిర్బంధించేదనీ వాడుక. ఈమె యిప్పుడిలా తాగుతుందేం—ఏమిటో. యిందాకా ఆనందాన్ని సిగరెట్లు మానమనలా. ఈ తత్వం మనుషులు ఎప్పుడేం చేస్తారో ఏమో చెప్పడం కష్టం.

తనూ వెంటనే వెళ్ళింది. నాయర్ రిక్షాను పిలిచాడు. హోల్డాలూ, సూట్ కేసూ రిక్షాలో వేసి. నాయర్‌ను స్టేషనుకు తెమ్మని. ముగ్గురం బస్సు ఎక్కాము. బస్సు ఎగ్మూరు స్టేషన్ దాటి స్కూలాఫ్ ఆర్ట్స్ క్రాస్ చేసేదాకా గమ్మత్తుగా ఉన్నారు ఇద్దరూ. తరువాత మాటలు, నవ్వులు! రైలుస్టేషనులో కూడా, నాగవల్లి నాటి సంరంభంలాగా ఏవేవో మాట్లాడుతూనే ఉన్నాం. రైలు కదిలింది. నిట్టూర్చి అన్నపూర్ణతోపాటు మేము యింటికి చేరాం.

ఇంటికి వొచ్చాకగానీ నాలో వేడి పుట్టలేదు. అన్నపూర్ణను పెళ్ళి చేసుకోవాలి! వేడి, నిమిషంలో తహ తహగా మారింది నాలో వెధవ కర్మం, దేనికన్నా తహతహ పుట్టాలేగాని, పుట్టిందా అంటే మరీ కోతిలా తయారవుతుంది నామనస్సు. నిగ్రహించకపోతే ఏం అవాకులూ చెవాకులూ పేలి, ఏం చెయ్యరాని పనులు చేస్తానో........

భోజనాలు చేశాం పల్చనిచారు, సాంద్రమైన పాలతో. మేడమీద పక్కలు వేసుకున్నాం. ఆకాశానా, యింట్లో, మాలో. మృతమౌనం! సప్తమహర్షులు పక్కన. సీరియస్ నాలోలాగా నిమిషనిమిషం రంగులు మారుస్తోంది. దూరాన కుజుడు ములుగోరింట పువ్వులాగా.

అన్నపూర్ణను కదిపితే....ఆమె కదిలించక ముందు మనం కదిలించి, అది విషమించి, ఉన్న యీ గోడుగూడా చెడి, తలుపులు మూయ

బడితే ... ఆలోచన వొచ్చిందేకాని, మనసూ, శరీరం ముందుకు వురుకు తున్నై. నేనే కావాలని కళ్ళాలుపట్టి ఆపాను.

సంసారం, తాపత్రయం, ఇబ్బందులూ, మధ్య మధ్య తటస్థించే ఎండమావులూ అన్నీ నా బుర్రను వేడెక్కించై. రాత్రి 11 దాటాక నిద్దరపట్టింది. తెల్లారి మామూలుగానే గడిచింది. ఆమె ప్రతి కదలికనూ, వేళ్ళల్లో కళ్ళల్లోగూడా జాగర్తగా చూస్తున్నాను. ఎన్నడూలేనిది కూరలు తరిగింది. ఓ హెన్రీ కథలు చదివింది. పక్కయింటికి వెళ్ళి కాస్సేపు వుండి వొచ్చింది. మధ్యాహ్నం సొమ్మసిల్లి నిద్దరపోయింది. నేను పక్కన ఉన్నట్టేలేదు, లేనట్టేలేదు. ఆనందం ఈమెను మొత్తాన కదిలించి ఉంటాడు. ఏవేవో కలలు కాంచి ఉంటారు! పదిగంటల ఆ ప్రాంతాల్లకు మా వూరి వాడొకడు కనబడితే వాడితోతిరిగి, అక్కణ్ణించే కొంతమందిని కలుసుకుని, అక్కడా అక్కడా గడిపి, మర్నాడు పదింటికి ఎగ్మూరు చేరాను. రైలు ప్రయాణపు దెబ్బతిని, నిద్దరలేక ఆపసోపాలుపడుతూ ఆనందం ఈజీ చైర్లో వున్నాడు. ఎదురుగుండా బల్లమీద యూలిసిస్. పరిచయ మందహాసం చేశాను. అతనూ మామూలు బజారు నవ్వు నవ్వి స్నానానికని లేచాడు. విశేషాలు ఏమీలేని మధ్యాహ్నం బండ బరువుగా గడుస్తోంది.

న్నాకు మెళకువ వొచ్చేప్పటికి పక్క గదిలోంచి మాటలు వినబడుతున్నై. అలాగే పడుకుని, చెవిని కాన్సంట్రేట్ చేశాను. అన్నపూర్ణ అంటోంది—

"నన్ను గురించి నీవు ఏమనుకుంటున్నావు అనేంత కిందికి ఎందుకు వచ్చావు? ఎవరు నిన్ను గురించి ఏమనుకుంటే నీకేం—నాకైనా అంతే. ప్రపంచం ఏమనుకుంటోందీ, ఏం చేస్తోందీ అని వాపోయేవాడికి ఆత్మవిశ్వాసం ఎంతుంటుందో నీకు తెలీదా? ఇవాళ, ఇన్నాళ్ళకు వొచ్చి

నన్ను గురించి ఏమనుకుంటున్నావు అని అడుగుతావుగదా, నీకే వేదన ఎందుకొచ్చింది?"

"అదే నేనూ పడేబాధ! నేను నీ మెడకు గుది బండ అయ్యా నని అనుకుంటున్నాను."

"కెణ్ణాళ్ళు, పోనీ కొన్నాళ్ళు తరిచిచూడు. నీకే తెలుస్తుందిగా! ఎవడో నిన్నుఏదో అని వుంటాడు. యీ చెవిలోదాన్ని ఆ చెవినిపోనీక!"

"చెప్పవ్!"

తల్లిని అడిగే పిల్లవాడిలాగా ఆనందం అడుగుతున్నాడు. మరి పించి, తాయిలంపెట్టి, కుర్రాణ్ణి జోకొట్టి చెరువుకుపోయే తల్లిలాగా అన్నపూర్ణ యింకో ప్రసంగంలోకి జారింది.

"నిజం! నన్ను నువ్వెందుకు ఆదరించావు! నేను యీ నా కోర్కె- లతో ఇబ్బందులతో కాలి, మాడి అలా సూన్యైపోకుండా, ఎందుకు నన్ను కట్టేశావ్, కట్టేసుకున్నావు?"

అన్నపూర్ణ కను బొమ్మలు ఎత్తి వో క్షణం చూసి ఉంటుంది. మరి మాటల్లేవు.

నేను వాళ్ళువొస్తారు కాబోలునని అల్లాగే కళ్ళు మూసుకుని పడు కుని ఉన్నాను. రాలేదు. శిలలాంటి మౌనంలో గడుపుతున్నట్టున్నారు. యీ రుషులు మౌనంగా వుంటారుగానీ, ఎలా వుంటారో....రాళ్ళలాగా, చెట్ల లాగా. వాళ్ళు అలాగే ఉండి ఉంటారు. అన్నట్టు ఈ ఆనందం కూడా, మౌనం క్రియేటివ్ ఎనర్జీ అంటాడు. చావనీ యీ రంధిసంధిలో.

కునుకు. కలలు. పోలీసులు అరెస్టు చేస్తామని వొస్తారు, మైనం బొమ్మలవలె మాట్లాడరు. ఎవడో చావటం, అతన్ని చంపారని పోలీసులు గొడవ, రభస, చిత్తక్షోభ. గుండె దడదడకొడుతూండగా లేచాను. సాయంత్రం పడ్డది. ఆనందం మేడమీద లుంగీకట్టుకుని, క్రాపింగు

మొగంమీద మూగగా ఒక్కడూ ఆలోచిస్తున్నాడు. అన్నపూర్ణ మామూలుగా, బొమ్మవలె శాంతంగా రేడియో వింటోంది. నేనే-కొంత చొరవ తీసుకుని సినిమాకని ప్రతిపాదన పెట్టాను. నెమ్మదిగా అందరూ దిగారు. వెస్టెండ్‌లో మాఘం. 'దిలెటర్' చూసివొచ్చాం, గుడ్డి వెలుతుర్లో. అన్నపూర్ణా, ఆనందం యిద్దరూ మనప్రపంచంలో లేరు.

రాత్రి గదిలో మళ్ళీ చేరాం. అన్నపూర్ణ గంధంగిన్నె తీసింది. ఆనందం గంధంగిన్నె చూసికూడా స్తబ్ధులాగా కదలకుండా ఉన్నాడు. గంధంలో పన్నీరు కలిపి టేబుల్‌మీద పెట్టింది ఆమె. ఎవరం కదలలేదు. పూసుకోరేమర్రా అంది.

"ఎవరికివారు పూసుకుంటారా" అన్నాను. కోతిమనస్సు గొలుసులు తెంపుకుంది. ఎంతమాట అనేశాను?

ఆనందంలేచి, యింతగంధంతీసి, నా మెడఅంతా పూసి, నాలాల్చీకి కూడా పూశాడు. అన్నపూర్ణ నవ్వలేదు సరిగదా, కోప్పడలేదు సరిగదా, ఏమీ అనలేదు. చూస్తూ ఊరుకుంది. తాను పూసుకోనూలేదు, ఏమీలేదు. మళ్ళీ నిట్టూర్చి, పోయి సోఫాలో కూలపడ్డాడు. వీడికేమన్నా నామీద జెలసీనా? అల్లా, పగపట్టిన పాములా ముడుచుకు పోతాడేం, లేక వీడు ఏదన్నా యిబ్బందితో, జబ్బుతో మూలుగుతున్నాడా?

అన్నపూర్ణ గంధంగిన్నె నాకు తెచ్చి యిచ్చి, నేను చేతులకు పూసుకున్నాక, యింతగంధం పేరంటాలుకు పూసినట్లు అతని మెడకు పూసింది. తీక్షంగా చూసి ఆనందం, వెధవనవ్వు, వాడిలిన పువ్వులాగా నవ్వాడు. బజారుధర్మాలకు నవ్వును రమ్మంటే మాత్రం, బలవంతాన వొచ్చిన ఆ నవ్వు మన్ని పట్టివ్వదా? అతన్ని రంజింపచేయడానికో, మరిదేనికో ఆమె మాట్లాడింది తనంత తాను. చీకట్లో వొంటరి మనిషి నడుస్తూ తనలోతాను బిగ్గరగా పాడుతున్నట్టు.

వెళ్ళి రేడియో వేశాడు ఆనందం. మళ్ళీ ఆపి వచ్చాడు. మేడ మీదకువెళ్ళి పడుకున్నాడు.

"ఆనందం ఏదో బాధపడుతున్నట్టున్నాడు" అన్నాను. ఆమె తల ఊపించి, మంచంమీద కూలబడ్డది. నే నామెను బలాత్కరించినా అప్పుడు ఏమీ జరిగి ఉండదు. కాని, నిగ్రహం నూటికి నూరుపాళ్ళూ రాజ్య మేలింది.

కోరంటికం అత్తారింటికి పోయే కోడలులాగు మేడమెట్లెక్కింది అన్నపూర్ణ. అన్నవలె నేనూ.

ఆకాశం చల్లదనం, నక్షత్రాల చెమక్, సీరియస్ కనపడలేదు. కుజుడు ఇంకా పైకి పోయాడు. నాకు సరిగా ప్రస్తరించటం రాదుకాని. మూర్ఛనలు పట్టలేనుగాని మేఘమల్లార రాగం పాడతగ్గ అదను అది.

నిద్దర పట్టడం మెఱకువ రావడ మేమిటీ, వాళ్ళు కనపడక పోవడ మేమిటీ, నాకేమీ తోచలేదు. గుండెల్లో రాయిపడ్డట్టయింది. ఏమిటో భయం భయంగా వుంది. కొంప తీసి వీళ్ళిద్దరూ గది బిగించుకుని పడుకో లేదుగదా! మెల్లిగా మెట్లమీదికి వొచ్చాను. మళ్ళీ మాట్లాడు కుంటున్నారు. అన్నపూర్ణ నెమ్మదిగా, కాపీనంగా, ఆచి ఆచి మాట్లాడు తోంది. "నీవు కనపడినరోజున, రాదర్ పరిచయమైన నాడు నీలోని ప్రతిభ, నీలోని సిన్సియారిటీ నాకు నచ్చింది. కాని, నీ ఊహలు, నీ ప్రయత్నాలు, అన్నీ డబ్బులేక అలా ఎండిపోతున్నా యనిపించింది. నువ్వెన్నన్నా చెప్పు, ఈ మన ఆశయాలు, అభిరుచులు ఎంత ఉన్నతాలైనా సరే—చేతిలో డబ్బులేకపోతే మనం ఏమీ సాధించలేం. గవర్న మెంటు, దేశం అందరూ కలిసి ఆరాటపడితే తప్ప ఈలోగా మనం ఏమీ బావుకోలేం. చేతిలో పుష్కలంగా పైసా వున్నా అడ్డంకులు ఎలాగూ

తప్పవు. కాని, యీ దారి, ఈ ఆలోచనలు, యీ పరిస్థితులు వేరు. ఇది నాకు ఇంటర్ చదువుకునే దినాల్లోనే తెలుసు. నీవు నిస్సహాయంగా, పొజిషన్ లేక బజారులోపడి తిరిగే కవులలో ఒకడివై తిరగటం నేను సహించలేకపోయాను. డబ్బువుంటేనేగాని సరీగా పలకరించనైనాలేని యీదేశం, యీ సంఘం నీబోటివాణ్ణి ఎలా నలగగొట్టుతుందో నాకు తెలుసు. నిన్నుగురించి ఆలోచించినప్పుడే నేను నీమీద జాలిగా వాలాను. ఆ తరువాత నీ యిష్టం, నీమీద ప్రేమ అన్నీ జాలితోనే వొచ్చై. నాకు తెలుసు నువ్వు ఏనాడైనా గొప్పవాడవౌతావనీ, యీ కవిత్వం అంతా రాచకీయంలో కలిపి, దేశానికి పంచదార కలిపిన పాలు యిస్తావనీ. నేను యివాళ సంపూర్ణంగా ప్రేమించేది, గౌరవించేది, లాలించేది నిన్నే. కానీ ఈ ప్రేమకు, యీ గౌరవానికి జాలీ, సింపతీ మూలాధారం. దాన్ని మర్చిపోతే, నాకు నేను ద్రోహం చేస్తాను. ఎలా వొచ్చిందో క్లియర్‌గా తెలుసుకోటం మంచిది. నిజం ఘోరం విషం అనే ఆస్కార్ వైల్డ్‌ను చదవక కాదు నువ్వు అడిగింది. నేను అప్పుడు చెప్పే మూడ్‌లో లేను." ఆనందం ఊపిరి విడవడం ఆపేశాడు.

నేను కొత్తలోకంలో కళ్ళు తెరిచి మళ్ళీ పక్కమీదకు చేరాను. తల అంతా గిరగిరా తిరుగుతోంది. పావుగంటకు మేడమెట్లు చప్పుడయినై. కళ్ళు మూసుకున్నట్లు, నిద్దరోతున్నట్లు నటించాను. ఎవరి పక్కలమీద వాళ్ళు దొర్లారు.

వో పొద్దువేళ చూస్తే ఆనందం పక్కమీద లేడు. అన్నపూర్ణ నిద్దరోతోంది. ఏడ్చి ఏడ్చి అలిసిన పిల్లవలె.

పొద్దెక్కాకే మాకు మెళుకు వొచ్చింది. కిందకుపోయి, మొహం కడుక్కుని, కాఫీతాగే ఎత్తులో ఉన్నాం. వీధిలో గోల. తలుపులు తట్టి

తున్నారు. వెళ్ళి కనుక్కొన్నాను. ఆనందం ఆత్మహత్య చేసుకున్నాట్ట. కోడిగుడ్డు ఆస్పత్రి ప్రక్కన బెంచిమీద. ఇది చెప్పటానికి నేను లోపలకు వెళ్ళలేక పోయినాను. నా గుండెలు ఆగినై. నేను కొయ్యబారి పోయాను. అన్నపూర్ణ వొచ్చింది, అంతా విన్నది. స్తబ్ధతలోనే నడిచి లోపలికి వెళ్ళింది. గదిలో టేబుల్‌మీద అతని కడపటి ఉత్తరం.

"అ—

నీ ప్రేమ ఎంత మధురమైందో, నీ జాలి అంత బాధాకరం. నీ 'సుధాజ్వాల'లో నేను అమృతమూర్తిని కాలేకపోయాను. మంటలో ఆత్మహత్య: నాకై కన్నీళ్ళు రాల్చకు. జీవితమే ఒక పీడ కల. పునర్జన్మలో నాకు విశ్వాసం లేదు. పోతున్నాను. నేను నీకు ఏమైనా గాయం కలిగించితే క్షమించు—

నీ

ఆనందం."

ఉత్తరం చేతపట్టుకుని, అన్నపూర్ణ, నేను వెళ్ళాం. ఆరోజు అంతా యిబ్బందులు, వేదన, కోలాహలం, అంతర్దాహం, దావానలం అనుభవించాము.

రెండు మూడు రోజులైనాక, బెజవాడ వెళ్ళొస్తానని వెళ్ళి, వుత్తరం రాశాను చాలా వినయంగానే, నన్ను పెళ్ళి చేసుకోమంటూ. వారం తిరిగింది జవాబు రాలేదు. కాలు కాలిన పిల్లిలా వుంది నా స్థితి. పెనంమీద అట్టులాగా వేగిపోతున్నాను ఆ ఆనందం బాగా గడిపితే నేనూ అల్లాగే వేగిపోతాను.

మద్రాసు వెళితే....ఎంత చెప్పినా, మనిషి ఎదురుగుండా వున్న విశేషంవేరు. సరీగ్గా ప్రయాణానికి మాత్రం అప్పుచేసి, మద్రాసు చేరాను. అదే స్టేషను, అవే రోడ్లు, అదే యిల్లు. ఐతేనేం, బోసిపోయి, బావురు మంటున్నై.

యింట్లోకి వెళ్ళాను.

"రండి!"—అన్నపూర్ణ.

వెళ్ళాను. మామూలుగానే మధ్యాహ్నం గడిచింది. మధ్యాన్నం టిఫిన్ దగ్గర నా పుత్తరం ప్రమేయం తెచ్చాను. ఆమె వొణికింది. సన్నని పొడుపైన వేళ్లు వొణుకుతున్నై. పచ్చని మొహం వివర్ణమైంది. ఎందుకడిగానా అనిపించింది, నేనే పొరబాటుపడుతున్నానేమో-ఆనందం గుర్తుకు వొచ్చి, ఆమె బాధ పడుతోందేమో! ఏమైనా ఆనందం గుర్తుకొస్తే—యీ ప్రసంగం తేవటమే తప్పు.

ఆగి, పెద్దగా నిట్టూర్చింది.

"నేను చాలా దయనీయమైన దశలో ఉన్నాను. నా ఆర్టు, నా ప్రతిభ అంతా సరిఐన అండలేక అడివిని కాసిన వెన్నెలలా తయారైనై. నేను నిజంగా గొప్పవాణ్ణి. మీరు నాకు అండగా దొరికితే, ఆశ్రయమిస్తే మమత్వం చూపిస్తే--చూస్కోండి" అంటున్నాను.

"నాయర్!"

నాయర్ వొచ్చాడు. డ్రింకులు తెమ్మంటుందా....

ఆమె తమాయించి, "కాస్సేపు మొహం చూపించకండి. ఎక్కడికన్నా వెళ్ళిరండి" అంది.

నా నవనాడులూ కుంగినై. బల్లెంతో వెన్నులో పోటు. ఊపిరి తెచ్చుకుని "I love you" అన్నాను.

"ఈ ఇడియట్ను బయటికి పంపించు" అని వెళ్ళిపోయింది. నాయర్ ఉరుముతూ నాకేసి చూస్తూ మిగిలాడు. ఫాన్ పైన తిరుగుతున్నా ముచ్చెమటలూ పోసినై.